## బోనాలను ఘనంగా నిర్వహిస్తాం



చంద్రానగర్ బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు

హిమాయత్‌నగర్,జూలై 2: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని బషీర్‌బాగ్, చంద్రానగర్ బస్తీ పంచ్ కమిటీ అధ్యక్షుడు సల్లా పవన్, ప్రధాన కార్యదర్శి జె.నవీన్ కుమార్ తెలిపారు. మంగళవారం చంద్రానగర్‌లో ముత్యాలమ్మ ఆలయ బోనాల ఉత్సవ నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బోనాల ఉత్సవ కమిటీ ప్రత్యేకంగా చొరవ తీసుకుంటుందని, ఈ నెల 28న జరిగే బోనాల పండుగలో భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొనాలని కోరారు.

## ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

హిమాయత్‌నగర్,జూలై 2: విద్యార్థులు ఉన్నత విద్య నభ్యసించి మంచి స్థాయికి చేరుకోవాలని మాజీ కార్పొరేటర్ జె.హేమలతయాదవ్, బీఆర్ఎస్ పార్టీ నేత జె.బాబు యాదవ్ అన్నారు. మంగళవారం రాంకోఠిలోని శక్తి గణేశ్ ఆలయం ఆవరణలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు ఇతర సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జీవితాలను మార్చేది చదువేనని, చదువు చాలా గొప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సత్యనారాయణ యాదవ్, రఘు, జగదీశ్‌గౌడ్, యాదయ్య పాల్గొన్నారు.

## నూతన విద్యా విధానాన్ని అమలు చేయొద్దు

హిమాయత్‌నగర్, జూలై 2: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్రాలకే అప్పగించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. నీట్, నెట్ పరీక్ష పేపర్ లీక్ జరగడం వల్ల దేశంలో 24 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించి తిరిగి నీట్ పరీక్షను నిర్వహించాలన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

# ఎర్రగడ్డలో సమస్యలపై శంఖారావం

- సమస్యల రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్
- స్థానికుల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు



స్థానికుడు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డ, జూలై 2: జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ సుల్తాన్‌నగర్‌లోని షంషీర్ ఫంక్షన్‌హాలులో మంగళవారం మాగంటి ఆధ్వర్యంలో 'సమస్యలపై శంఖారావం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్య పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. చిన్న, చిన్న సమస్యల పరిష్కారం కోసం ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో సమస్యలపై శంఖారావం కార్యక్రమాన్ని కొన్నేండ్లుగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల వల్ల వివిధ శాఖలకు చెందిన అధికారులు వారి పరిధిలోని సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించిన వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గతంలో అన్ని విధాలా వెనుకబడ్డ ఎర్రగడ్డ డివిజన్‌కు నిధుల కేటాయింపు విషయంలో పెద్ద పీట వేసి, పలు అభివృద్ధి పనులను పూర్తి చేసిన అంశాలను వివరించారు.

### అధికారులకు అందిన ఫిర్యాదులు..

ఎర్రగడ్డలో నిర్వహించిన సమస్యలపై శంఖారావం కార్యక్రమానికి ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సూచన మేరకు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. బల్దియా డిప్యూటీ కమిషనర్ ఎస్లావత్ నాయక్, వివిధ శాఖల అధికారులు వాహబ్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, బాలరాజ్, గిరిధర్ రావు, సరస్వతి, ప్రేమ్‌కుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు. తాగునీరు, సీవరేజీ, విద్యుత్, రెవెన్యూ, పౌరసరఫరాల అంశాలపై స్థానికులు ఫిర్యాదుల రూపంలో సమస్యలను సంబంధిత అధికారులకు అందజేశారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంజీవ, షరీఫ్ ఖురేషీ, జావి ద్, సయ్యద్ రసూల్, కల్యాణి, బాలు, అజీజ్, జానీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## జగన్నాథ రథయాత్రకు భారీ ఏర్పాట్లు



జగన్నాథ రథయాత్ర నేపథ్యంలో అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 2: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ హౌసింగ్ బోర్డు బృందావన్ కాలనీలో జరిగే జగన్నాథ రథయాత్ర ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఆదివారం జరగబోయే జగన్నాథ రథయాత్ర ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు యాత్ర కొనసాగే మార్గంలో గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు, తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. యాత్ర సందర్భంగా రోడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. రాత్రి వేళల్లో స్ట్రీట్ లైట్స్ వెలగని వాటిని గుర్తించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహ మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, మున్న సోరోజ్, గిరిధర్, శంకర్, శ్రీనివాస్ రెడ్డి, అడికే శివ, మధుసూదన్ రెడ్డి, మాలతీ, ప్రసాద్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి



గాంధీనగర్‌లో పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

జూబ్లీహిల్స్, జూలై 2: రహ్మత్‌నగర్ డివిజన్‌లో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సంబంధిత అధికారులను కోరారు. డివిజన్‌లోని గాంధీనగర్‌లో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సీవరేజీ పనులను సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. సీవరేజీ పనులు పూర్తయితే గాంధీనగర్ నుంచి సంజయ్‌నగర్, ఎన్ఎస్‌బీ నగర్ వరకు రోడ్ల నిర్మాణం చేపడతామని బస్తీ వాసులకు హామీ ఇచ్చారు.

## మంచినీటి సమస్యను పరిష్కరిస్తాం

మేయర్ లతాప్రేమ్‌గౌడ్



జలమండలి అధికారులతో కలిసి మూసీ మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ, జూలై 2: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు మంచినీటి కష్టాలు తీర్చేందుకు అనేక చర్యలు చేపడుతున్నామని మేయర్ లతాప్రేమ్‌గౌడ్ పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని మూసీ నదిలో నూతనంగా నిర్మిస్తున్న మంచినీటి నిర్మాణ పనులను జలమండలి అధికారులు, పైపులైన్ నిర్మాణ కాంట్రాక్టు సంస్థ మెగా ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మూసీ నదిలో ఇప్పటి వరకు నిర్మించి ఉన్న మంచినీటి పైపులైన్‌ల నిర్మాణం వరద నీరు భారీగా వచ్చి కూలిపోయిందన్నారు. తద్వారా ప్రజలకు మంచినీటి ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. ప్రస్తుతం అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి పైపులైన్‌లను బ్రిడ్జ్ లెవల్‌లో నిర్మిస్తున్నామని, తద్వారా వరద నీరు వచ్చినా సాఫీగా వెళ్లేందుకు అవకాశం ఉండేలా నిర్మాణం చేపడుతున్నామన్నారు. త్వరలో కార్పొరేషన్ పరిధిలోని ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



ఖానాపూర్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్, అధికారులు

మణికొండ, జూలై 2: నార్సింగి మున్సిపాలిటీలో నెలకొన్న ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. ఖానాపూర్ వార్డులో మంగళవారం కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ స్కూల్, కమ్యూనిటీహాల్, బుల్కాపూర్ నాలా, పారిశుధ్య పనులను ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అలాగే బాత్‌రూమ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. బుల్కాపూర్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే పనులను ముమ్మరం చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంల వార్డు ఆఫీసర్ రాకేశ్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## సీజనల్ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్

మణికొండ, జూలై 2: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవడంతో పాటు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా తదితర వ్యాధులపై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు అధికంగా వ్యాపిస్తాయన్నారు. రోడ్లపై మురుగునీరు నిలిచిపోవడం, చెత్తచెదారం, వ్యర్థాల కారణంగా దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాలను వ్యాప్తి చేస్తాయన్నారు. వీటి నివారణకు అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో, పీహెచ్ఎస్, ఎంపీహెచ్ఓ, సూపర్‌వైజర్లు, మున్సిపల్ మేనేజర్, మున్సిపల్ సెంటర్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన



పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్, జూలై 2: దైవ దర్శనం కోసం ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు తనవంతు సహకారం అందిస్తానని హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి తెలిపారు. రాజమోహల్లా బస్తీలో ఉన్న ఆలయం వద్ద మంచినీటి సమస్యను గుర్తించి మంగళవారం రూ.50 వేలతో మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జి.రామన్‌గౌడ్, మహేశ్ పాల్గొన్నారు.

## విధుల కోసం వెళ్లి అదృశ్యం..

ఖైరతాబాద్, జూలై 2 : విధులకు వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయాడు. ఖైరతాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది.ఏఎస్ఐ శ్రీరాములు కథనం ప్రకారం... మున్సిపల్ గ్రౌండ్ సమీపంలోని దామేష్ అపార్ట్‌మెంట్‌లో మీనా శెట్టి, ప్రేమ్ కుమార్ రామ్ (29) దంపతులు నివసిస్తున్నారు. ప్రేమ్ కుమార్ రామ్ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో హోటల్ రాక్‌డేల్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు.గత నెల 11న ఇంటికి వచ్చిన ప్రేమ్ కుమార్ తిరిగి 14న విధుల కోసం బయలుదేరి వెళ్లాడు. అదే రోజు రాత్రి అతని నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. భార్య ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ వచ్చింది. హయత్‌నగర్ ఆర్టీసీ కాలనీలో ఉండే తల్లిదండ్రులు, సోదరిని ఆరా తీయగా ఫలితం లేదు. దీంతో భార్య మీనా శెట్టి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పాత బకాయిలు చెల్లించమని అడిగినందుకు..

- సెల్‌ఫోన్ షాపు ధ్వంసం
- నిందితులను అరెస్ట్ చేసిన ఎస్.ఆర్ నగర్ పోలీసులు

వెంగళరావునగర్, జూలై 2 : పాత బకాయిలు చెల్లించమన్నందుకు మొబైల్ రిపేర్ దుకాణం సిబ్బంది పై దాడి చేసి, దుకాణంలో సామగ్రిని సైతం ధ్వంసం చేసిన ఏడుగురి పై ఎస్.ఆర్ నగర్ పోలీసులు కొత్త చట్టం భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) కింద తొలికేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. అమీర్‌పేట ఆదిత్యా ఎన్‌క్లేవ్‌లోని నీలగిరి బ్లాక్‌లో నికేశ్ కుమార్ అనే వ్యక్తి మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. కూకట్‌పల్లిలో మొబైల్ రిపేర్ దుకాణం నిర్వహించే అఖిల్ (26) తన వద్దకు వచ్చే మొబైల్ ఫోన్లను నికేశ్‌కుమార్ వద్దకు తీసుకువచ్చి మరమ్మతులు చేయించుకుని తీసుకెళ్తుంటాడు. కాగా ఇటీవల రెండు ఫోన్లకు చెందిన డిస్‌ప్లేలను డబ్బు చెల్లించకుండా తీసుకుపోయిన తరువాత మరో మొబైల్ ఫోన్‌ను మరమ్మతుల కోసం తీసుకు వచ్చాడు. అయితే పాత ఫోన్ల డిస్‌ప్లేలకు చెందిన డబ్బులు చెల్లించాలని యజమాని నిఖేశ్ కుమార్ చెప్పాడు. దీంతో సోమవారం సాయంత్రం అఖిల్ తన మిత్రులు ఆరుగురితో కలిసి నీలగిరి బ్లాక్‌లోని నిఖేశ్‌కుమార్ దుకాణానికి వచ్చి విధ్వంసం సృష్టించాడు. దుకాణంలో పనిచేసే శశికుమార్, ముఖేశ్ కుమార్‌లను స్క్రూడ్రైవర్లు, ఇతర సామగ్రితో గాయపరిచి, తీవ్రంగా కొట్టారు. దుకాణంలో సామగ్రిని ధ్వంసం చేశారు. అంతేకాకుండా షాపులోని సెల్ ఫోన్లు చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. దీంతో బాధితుడు నిఖేశ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ పుటేజీని పరిశీలించిన పోలీసులు అఖిల్‌తో పాటు అతడి మిత్రులు మరో ఆరుగురి పై బీఎన్ఎస్ చట్టం ప్రకారం 118(1), 324(4), 351(3),రెడ్ విత్ 190 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



పెద్దషాపూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న సాగర్ స్నేక్ సొసైటీ సభ్యులు, ఎస్సై రాజ్‌కుమార్ తదితరులు

శంషాబాద్ రూరల్, జూలై 2 : పర్యావరణ పరిరక్షణకు ప్రజలు కృషి చేయాలని సాగర్ స్నేక్ సొసైటీ సభ్యులు కోరారు. గత నెల 22న పర్యావరణ పరిరక్షణ కోసం సాగర్ స్నేక్ సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన పాదయాత్ర మంగళవారం శంషాబాద్‌కు చేరుకుంది. శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్‌కు చేరుకున్న యాత్ర స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై రాజ్‌కుమార్‌తో కలిసి రెండు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరు కృషి చేయాలని, ఇందుకోసం పాదయాత్రలో భాగంగా ప్రతి గ్రామంలో రెండు మొక్కలు నాటుతూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కుమార్, గోపాల్, దేవేందర్, కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై నజర్..

సెప్టెంబర్ వరకు అప్రమత్తం..

జూబ్లీహిల్స్, జూలై 2 : వర్షాలతో సీజన్ మారుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఈ మేరకు దోమలు విజృంభించకుండా చర్యలు తీసుకోవడంతో పాటు డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసేందుకు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో సర్వే చేయడంతో పాటు వెక్టర్ బోర్న్ డిసీజెస్ క్యాంపులు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానలు, క్లస్టర్ మలేరియా యూనిట్లు, జీహెచ్ఎంసీ మలేరియా, ఎంటమాలజీ విభాగాలతో కలిసి ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా దోమలు పుట్టకుండా పాత వస్తువులలో నీటిని తొలగించడం, ఇండ్ల పరిసరాల్లో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడటం.. వాటి నుంచి దోమలు పుట్టకుండా స్ప్రే చేయడం వంటి పనులు చేపట్టనున్నారు. ఆయా బృందాలు డెంగీ పాజిటివ్ కేసులు నమోదైన పరిసర ప్రాంతాల్లోని 50 గృహాల్లో సర్వే చేయనున్నారు. డెంగీ లక్షణాలు కనపడితే అక్కడే శాంపిల్స్ తీసి పరీక్షలకు పంపించనున్నారు. వర్షాలతో దోమలు విజృంభించే నేపథ్యంలో సెప్టెంబర్ వరకు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆయా అధికారులకు, బృందాలకు సూచించింది.

# అర్హులకే డబుల్ ఇండ్లు..

జూబ్లీహిల్స్ , జూలై 2: డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అతి త్వరలో అర్హులకు కేటాయిస్తామని, అందరి అంగీకారంతో అసలైన లబ్ధిదారులను గుర్తిస్తామని ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రహ్మత్‌నగర్ డివిజన్ కమలానగర్‌లో రెవెన్యూ అధికారులు బస్తీ సభలో లబ్ధిదారులతో సమావేశమయ్యారు. రహ్మత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సమక్షంలో లబ్ధిదారులతో మాట్లాడి వారి దరఖాస్తులను, పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా 44 మంది అర్హులకు డబుల్ బెడ్‌రూమ్‌లు అందలేదని గుర్తించి సమగ్ర విచారణ చేపట్టి తుది జాబితాను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. అసలైన లబ్ధిదారులను గుర్తించేందుకు పూర్తిస్థాయి విచారణ చేపట్టి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామని తహసీల్దార్ తెలిపారు. లబ్ధిదారులు ఆందోళనకు గురికావద్దని.. కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, నాయకులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సమక్షంలో డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులతో సమావేశమైన తాసీల్దార్ నయీముద్దీన్

## పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 9లోగా సంబంధిత కళాశాలల్లో, రూ.200 అపరాధ రుసుముతో 10 వరకు చెల్లించవచ్చు.

### రివాల్యుయేషన్‌కు దరఖాస్తులు..

ఓయూ పరిధిలోని లా కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి, ఈ నెల 18లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 31లోగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## అదనపు బ్యాగేజీ సేవలు ప్రారంభం

కొండాపూర్, జూలై 2 : ఎక్సెస్ బ్యాగేజీ సేవలలో అగ్రగామిగా ఉన్న అవాన్ ఎక్సెస్ తన సేవలను హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రారంభిస్తున్నట్లు అవాన్ వ్యవస్థాపకుడు, సీఈఓ మీరాసింగ్ అన్నారు. మంగళవారం కొండాపూర్‌లోని అవాన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎక్సెస్ బ్యాగేజీ సేవలకు మారుపేరుగా అవాన్ సేవలందిస్తుందని, ఎయిర్‌లైన్స్‌తో పోల్చితే అవాన్ బ్యాగేజీ సేవలను చాలా తక్కువ ధరకు అందిస్తున్నట్లు తెలిపారు.

**IN THE COURT OF THE HON' BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT : MALKAJGIRI**
**O.S. No. 88 of 2022**

**Between:**
Mengarthi Venkata Laxminarayana .... Plaintiff
And
Mengarthi Venkataramanamma & Others ...Defendants

**NOTICE**

To,
Thathapudi Shankar, S/o. Apparao, Aged 50 Years, Occ: Doctor, R/o. H.No. 8-2-684/A, Flat No. 201, Bhavya Fantastic, Road No. 12, Banjara Hills, Hyderabad
...Respondent No. 9 / Proposed Defendant No. 9

Please take notice that the Plaintiff has filed the suit for partition against defendants being O.S. No. 88 of 2022 and in the said suit he has filed three applications seeking to amend the plaint being I.A. No. 882 of 2023, to file documents on record being I.A. No. 883 of 2023 and to implead you as Defendant No. 9 in the said suit being I.A. No. 828 of 2023. The case is posted on 26-07-2024 for your appearance, if any. Hence you are hereby directed to appear before the Hon'ble Court on 26-07-2024 at 10:30 AM, either in person or through advocate, failing which the matter will be decided as per law. Hence this notice.

**/BY THE ORDER OF THE HON'BLE COURT/**
**Sd/- D.R.Hari Prasad**
**Deepesh Bahadur**, Advocates
Office at: Plot No. 44, Dr. Subba Rao Nagar Colony, Picket, Secunderabad-500026 Ph. 9573227757

**PUBLIC NOTICE**

General public It is hereby inform that our Client **SRI MOHAMMED ABDUL KHALIQ S/o Late Mohammed Sharif,** Aged: 53 Years, Occ: Private Service, **Ad. No: 6942 6614 4283,** R/o H.No: 6-2-43, Plot No: D-7, Sun City Colony, Bandlaguda Jagir, Rajendra Nagar, Hyderabad-TS.500018, Presently Residing at MDFE6963, Ibrahim Bin Abdullah AL Suweil Street, King Fahad District, Makkah, Kingdom of Saudi Arabia, 24341, Passport bearing No:Z2811332, along with his brother **Sri Mohammed Abdul Khadir,** Have been executed General Power of Attorney, Through registered Bearing Document No: 1502 of 2022, Dated: 15-02-2022, Registered at SRO Shamshabad, in favour of **MR. SYED ISMAIL** S/o Syed Gulab, for the open plot, bearing Plot No: 51, Area: 400 Square Yards or 334.4 Square Meters, in Survey No's: 1,2,3,4,5,6, 7,8,9,10 & 11, Situated at Pedda Thupra Village, (Maktha Kamar Nagar) & Grampanchayat, Shamshabad Mandal, R.R. District, TS, and Bounded by **North:** 33'-0" WIDE ROAD, **South:** PLOT NO: 52, **East:** PLOT NO: 65, **West:** 33'-0" WIDE ROAD. The same Registered General Power of Attorney is absolutely and completely and revoke all power of authority thereby and there under given to Mr.Syed Ismail before revocation either expressly or impliedly to do all acts, deeds intents and purposes regarding the any such properties, through registered REVOCATION/CANACELLATION OF GENERAL POWER OF ATTORNEY, through Certificate U/s 18 of Indian Stamp Act 1899, File No: 7389/A/2024, on Dated: 11-06-2024 at District Registrar, Ranga Reddy District, TS.

If any person or persons, banks, financial institutions, Govt. Department public or private authorities, Etc, Whomsoever having any objection/claim/right over the property for the said transaction may approach to our office along-with all relevant original documents, etc. within (7) Seven days from the date of this publication. Thereafter, no claim or anybody will be entered and our client will proceed for further registration process to complete the further transaction.

Sd/- **M.Y LAW FIRM & ASSOCIATES**
**M/s M.YADAIAH GOUD**
**M.RAMA KRISHNA GOUD**
Advocates
Office at Flat No.201, J D Residency, Shamshabad Municipal, Ranga Reddy Dist, Telangana State-501218.
**Cell: 09963632535, 9182541234**